క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏర్పాటు



గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీలో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. స్కౌట్స్ మాస్టర్ చందు సాయి, రాయలసీమ కన్వీనర్ వెంకట సుమంత్, జిల్లా కమిషనర్ కౌసల్య తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి అసోసియేషన్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి స్కౌటింగ్ తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహులు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

తాడిపత్రి అర్బన్: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని కూటమి సర్కార్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు గణనీయంగా పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, కేశవరెడ్డి, సంతోష్, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, మండల కార్యదర్శి నాగరంగయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

16న టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఫిబ్రవరి 6 నుంచి 14 వరకూ మాఘమాసంలో నిర్వహించే రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల (తిరునాల) సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి ఈ నెల 16న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ నాగేంద్రుడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల టెంకాయల వేలం పాటతో పాటుగా ఫిబ్రవరి 15 నుంచి 2026 పుష్య మాసం నెలాఖరు వరకూ ఏడాది పాటు టెంకాయల విక్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు దేవాలయ అధికారి వద్ద రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వివరాలకు ఆలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలన్నారు.

ఆది గురువు అమ్మ



తల్లులకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

గుంతకల్లుటౌన్: పుస్తకాల్లో పాఠాలను ఉపాధ్యాయులు చెబితే..జీవిత పాఠాలను నేర్పేది మాత్రం అమ్మేనని, అందుకే ఎవరి జీవితంలోనైనా అమ్మే తొలి గురువు అని టెండర్‌రూట్స్, బ్రమరాంభిక విద్యాసంస్థల కరస్పాండెంట్ వసుంధర అన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం టెండర్ రూట్స్ పాఠశాలలో తల్లికి పాదాభివందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పిల్లల చేత తల్లులకు పాదాభివందనం చేయించి, అమ్మ విశిష్టత, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

ఇండియాలో పుట్టడం అదృష్టం



మాట్లాడుతున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు మెంబర్ మౌలానా గయాస్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మదరసాను శుక్రవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు మెంబర్, సఫా బైతుల్ మాల్ ఆల్ ఇండియా అధ్యక్షుడు హజరత్ మౌలానా గయాస్, పలువురు ఉలమాలు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇండియాలో పుట్టడం నా అదృష్టమన్నారు. ప్రాణం ఉన్నత వరకు ఇండియాలోనే జీవిస్తానన్నారు. సోదరుల్లా కలసిమెలసి జీవిస్తున్న హిందూ–ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా హిందువులు, ముస్లింలు ఎప్పటికీ సోదరుల్లా ఉంటారన్నారు. కార్యక్రమంలో మదరసా నిర్వాహకులు మౌలానా మహ్మద్ అబ్దుల్ హాఖ్, హఫీజ్ ఖాలిద్, కలాం హఫీజ్‌తో పాటు మాజీ సర్పంచు పీరా, రఫి తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న దానిమ్మ

- ప్రస్తుతం టన్ను దానిమ్మ రూ.1.80 లక్షలు
- ధరల పెరుగుదలపై అన్నదాతల హర్షం
- తెగుళ్ల కారణంగా తగ్గిన సాగు విస్తీర్ణం





పుట్లూరు సమీపంలో సాగు చేసిన దానిమ్మ తోట, దానిమ్మ కాయలను మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

పుట్లూరు: ఆరోగ్యానికి అమృతంగా పిలిచే దానిమ్మ పండుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ధరలు భారీగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరిగాయని అన్నదాతలు చెబుతున్నారు. శింగనమల నియోజకవర్గంలో 1650 హెక్టార్లలో దానిమ్మ సాగు విస్తరించింది. దానిమ్మ సాగు కోసం ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.1.2లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు 350 నుంచి 400 మొక్కల చొప్పున దానిమ్మ మొక్కలను సాగు చేస్తారు. గత కొన్నేళ్లుగా దానిమ్మ సాగులో బ్యాక్టీరియా తెగులు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్న రైతులు మాత్రం లాభాలు ఆర్జిస్తున్నారు. నెల రోజుల క్రితం టన్ను రూ.50 వేలు ఉన్న దానిమ్మ ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.80 లక్షలకు చేరుకోవడం రైతులకు ఆనందాన్ని నింపుతోంది. గురువారం, శుక్రవారం పుట్లూరు, యల్లనూరు మండలాల్లో టన్ను రూ.1.50 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.1.80 లక్షల వరకూ కొనుగోళ్లు జరిగినట్లు వ్యాపారులు, రైతులు తెలిపారు.

బ్యాక్టీరియా నివారణ కోసం రూ. లక్షల వ్యయం

దానిమ్మ తోటలకు బ్యాక్టీరియా సోకడంతో గత కొన్నేళ్లుగా రైతులు రూ.లక్షల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ దానిమ్మ కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడటంతో కాయలలో నాణ్యత లోపించి రైతులకు నష్టం తప్పలేదు. తెగుళ్లను నివారించలేక పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వందల ఎకరాల్లో రైతులు దానిమ్మను తొలగించి అరటి పంటను సాగు చేశారు. అయితే పోయిన చోటే వెతుక్కోవాలని కొందరు రైతులు పట్టు విడవని విక్రమార్కుల్లాగా దానిమ్మ పంటను సాగు చేస్తూ తెగుళ్లను నివారిస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడి

దానిమ్మ సాగు ద్వారా ఎకరాకు 8 టన్నుల నుంచి 12 టన్నుల వరకు దిగుబడి పొందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి ఉంటుది. ఇదే సమయంలో దానిమ్మ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కరువైంది. దీంతో పెట్టుబడులు భారంగా మారి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి దానిమ్మ రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తే దానిమ్మ పండ్లతోటల సాగుకు మళ్లీ వైభవం వచ్చే అవకాశం ఉంది.

దానిమ్మ సాగు ఇలా..

మండలం	ఎకరాలు
పుట్లూరు	827
యల్లనూరు	1,238
బుక్కరాయసముద్రం	519
గార్లదిన్నె	551
శింగనమల	543
నార్పల	279
తాడిపత్రి	406
పెద్దపప్పూరు	935
పెద్దవడుగూరు	120
యాడికి	70

6.90 ఎకరాల్లో 95 టన్నుల దిగుబడి



తెగుళ్లతో గత కొన్నేళ్లుగా దానిమ్మ సాగు చేసిన రైతులు భారీగా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా మంది తెగుళ్లను నివారించడానికి కష్టంగా మారి దానిమ్మ చెట్లను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు, అరటి తోటల వైపు వెళ్లారు. ఈ ఏడాది దానిమ్మకు గరిష్ట ధర రూ.1.80 లక్షలు పలకడం ఆనందంగా ఉంది. నేను సాగు చేసిన 6.90ఎకరాల్లో ఇప్పటి వరకు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకూ 45 టన్నులు విక్రయించాను. మరో 40 టన్నుల దానిమ్మ కోతకు సిద్ధంగా ఉంది. – సుదర్శనరెడ్డి, బాలాపురం

టన్ను రూ.66 వేలకు విక్రయించా



దానిమ్మ ధర రూ.1.80 లక్షలకు పెరగడం చాలా ఆనందాన్ని కల్గిస్తోంది. నేను రెండు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. దానిమ్మ కాయలు కోతకు రావడంతో నెల రోజుల క్రితం టన్ను రూ.66 వేలతో విక్రయించాను. తెగుళ్లతో పంట సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల ఇటీవల ధరలు భారీగా పెరిగాయి. ఇలాంటి ధరల వల్ల దానిమ్మ సాగు విస్తీర్ణం భవిష్యత్తులో భారీగా పెరిగే అవకాశముంది. – రంగనాయకులు, కందికాపుల

బాల్య వివాహాలను అరికడదాం



గుంతకల్లులో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



శింగనమలలో మాట్లాడుతున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ

గుంతకల్లు/గుంతకల్లు టౌన్/యల్లనూరు/పామిడి/గుత్తి/శింగనమల: బాల్యవివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి, మెప్మా ప్రాజెక్టు అధికారి మోహన్ సూచించారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని వాల్మీకి కల్యాణమండపంలో కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల సీహెచ్ఓ నాగమణి, ఈఓఆర్‌డీ నాగభూషణం, ఏపీఎం గుణశ్యామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి,పుష్పావతి, కృష్ణవేణి, షాహీదా, నెలగొండ, నరసాపురం జెడ్పీ హైస్కూల్స్ హెచ్ఎంలు పుండరీకాక్ష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ నార్పల సెక్టారు సీడీపీఓ భారతి, సీహెచ్ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ రాజామణి, నిట్టూరు ప్రధానోపాధ్యాయుడు ఓబయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి ఎంపీడీఓ సమావేశ భవనంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో గుత్తి సీడీపీఓ ఢిల్లీశ్వరి, ఉపన్యాసకురాలు రాజ్యలక్ష్మి, ఏపీఎం నల్లప్ప, హెల్త్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీరామిరెడ్డి, రామలక్ష్మి, హెడ్‌మాస్టర్లు, మహిళా సంరక్షక కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, సీఐ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు. శింగనమలలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, ఏపీఎం నారప్ప, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, రామాంజనమ్మ, ఉపాధ్యాయులు, సీసీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



నక్కనదొడ్డిలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్/గుత్తిరూరల్/పామిడి/యల్లనూరు/గార్లదిన్నె: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి, తిమ్మాపురం గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 28 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అలాగే గుత్తి మండలంలోని తురకపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఓబులేసు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, వీఆర్‌ఓలు, సర్వేయర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి మండలంలోని రామగిరి, అప్పాజీపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 65 అర్జీలు అందాయని తహసీల్దార్ శ్రీధరమూర్తి తెలిపారు. సర్వేయర్ మురళీధర్, దేవదాయ శాఖ ఈఓ క్రిష్ణయ్య, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండలంలోని కోడిమూర్తిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు రాజా, ఆర్ఐ చిన్ననారాయణమ్మ, సర్వేయరు షర్మిలీ, వీఆర్వో సరళ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గార్లదిన్నె మండల పరిధిలోని బూదేడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈరమ్మ, సర్పంచు శివయ్య, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



గుంతకల్లులో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎస్ఆర్ఐటీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుమిత

గుంతకల్లుటౌన్/పెద్దవడుగూరు/గుత్తి/బుక్కరాయసముద్రం: గుంతకల్లులోని సీఐటీయూ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, ఐద్వా నాయకురాళ్లు సుగుణ, షాకీరా, అమృతబాయి, సరోజ, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు మండల కేంద్రంలోని లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాల, చిత్రచేడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం మహిళా టీచర్లు, ఉపాధ్యాయులు సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గుత్తి ఆర్ఎస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.ఎం.రంగనాయకులు ఆధ్వర్యంలో జీఎం బాషా, వరదరాజులు, విజయ్, సువర్ణ సావిత్రి బాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎన్‌సీసీ, హెచ్‌అండ్‌ఎస్ విభాగం సంయుక్తంగా సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుమిత, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వినత, విద్యార్థులు పాల్గొన్నారు

సజావుగా మండల సమావేశం



మాట్లాడుతున్న పుట్లూరు ఎంపీపీ బి.రాఘవరెడ్డి

పుట్లూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బి.రాఘవరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అలివేలమ్మ మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకరావాలని సభ్యులను కోరారు. అనంతరం అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయ అధికారి కాత్యాయని బీమా గురించి వివరిస్తున్న సమయంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ రైతులకు ప్రయోజకరమైన ఉచిత పంటల బీమా పథకం కొనసాగించాలన్నారు. అలాగే వ్యవసాయ పనులు లేని గ్రామాల్లో పనులు చేపట్టాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఈఓఆర్డీ జిలాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపప్పూరు: మండలవ్యాప్తంగా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు దిగబోయి యువకుడి మృతి

తాడిపత్రి రూరల్: వేగంగా వెళుతున్న రైలు నుంచి దిగబోయి ఓ యువకుడు మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని విజయనగర్ కాలనీకి చెందిన మోహన్‌నాయక్ (31) స్థానికంగా ఓ టీ కొట్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. కంటి సమస్యతో ఇబ్బంది పడుతు న్న తల్లి లీలాబాయికి చికిత్స కోసం గురువారం వైఎస్సార్ జిల్లా కడపలోని రిమ్స్ ఆస్పత్రికి పిలుచుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం అదే రోజు సాయంత్రం మంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ రైలుకు తాడిపత్రిలో స్టాపింగ్ లేకపోవడంతో గుత్తి రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి షిర్డీ నగర్ రైలు ఎక్కారు. మహిళా కంపార్ట్‌మెంట్‌లో ఉన్న తల్లి తాడిపత్రి రాగానే రైలు దిగింది. కుమారుడి కోసం జనరల్ కంపార్ట్‌మెంట్ వైపుగా వెళుతుండగా రైలు కదిలింది. నిద్రలో ఉన్న మోహన్‌నాయక్ మేల్కొనేలోపు రైలు చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ దాటుతోంది. దీంతో ప్లాట్‌ఫాంపై రైలు దిగడానికి ప్రయత్నించాడు. రైలు వేగంగా వెళుతుండడంతో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటికే కుమారుడు రైలు దిగలేకపోయాడంటూ తల్లి నుంచి సమాచారం అందుకున్న తాడిపత్రి రైల్వే పోలీసులు చల్లవారిపలి స్టేషన్ మా స్టర్‌కు సమాచారం అందించారు. అప్పటికే మోహన్‌నాయక్ మృతి చెందిన విషయం లీలాబాయికి తెలపడంతో ఆమె బోరున విలపిస్తూ చల్లవారిపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. మృతునికి వివాహం కాలేదు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరికి జీఎం అవార్డులు





జీఎం అవార్డు అందుకుంటున్న మల్లికార్జున, మనోజ్ కుమార్

గుత్తి: గుత్తి రైల్వే డీజిల్‌షెడ్ ఉద్యోగులు మల్లికార్జున (ఆఫీస్ సూపరింటెండెంట్), మనోజ్ కుమార్ (సీనియర్ సెక్షన్ ఇంజినీర్) జీఎం అవార్డులు అందుకున్నారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయంలో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా వారు జీఎం అవార్డులు స్వీకరించారు. మల్లికార్జునకు కాళ్లు లేకపోయినా వృత్తిలో నైపుణ్యం, ప్రతిభ కనబరిచారని జీఎం అభినందించారు.

వాహనం ఢీ కొని జింక పిల్ల మృతి

గుత్తి: పట్టణ శివారులోని మాసినేని ఉన్నత పాఠశాల సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక పిల్ల మృతి చెందింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ గమనించి కిందకు దిగి మృతి చెందిన జింక పిల్లను రోడ్డు పక్కకు తరలించాడు. ఘటనపై ఫారెస్టు అధికారులు విచారణ చేపట్టారు.



మృతి చెందిన జింక పిల్ల

నిదనవాడలో లెదర్ పార్క్ పరిశీలన



లెదర్ పార్క్‌ను పరిశీలిస్తున్న అధికారులు

శింగనమల: మండలంలోని నిదనవాడ గ్రామం వద్ద ఉన్న లెదర్ పార్క్‌ను శుక్రవారం అధికారులు పరిశీలించారు. 20 సంవత్సరాల నుంచి మూతపడిన లెదర్ పార్క్‌ను తెరవాలంటూ కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అధికారులకు , ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. దీంతో లిడ్క్యాప్ రీజినల్ మేనేజర్ భువనేశ్వరి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు జ్యోతిబాబు, ప్రతాప్, ఏపీఐఎస్ శివమోహన్ కృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి గీతావాణి, ఎల్‌డీఎం మురళీమాధవ్ పరిశీలించారు. అక్కడికి వచ్చిన కేవీపీఎస్, శిక్షణ పొందిన యువకులతో వారు మాట్లాడారు. కొత్త వారికి శిక్షణ ఇస్తామని, గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. అలాటే బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులుపెద్దన్న, ఆదినారాయణ, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

నదుల అనుసంధాన ప్రాజెక్టును కేంద్రమే చేపట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: గోదావరి–కృష్ణ నదుల అనుసంధాన ప్రాజెక్టు పనులను కేంద్ర ప్రభుత్వమే చేపట్టి పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 90 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన నదుల అనుసంధాన ప్రక్రియ పూర్తయితే దాదాపు 300 టీఎంసీల నీటిని రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం ఉందన్నారు. ఈ విషయంగా అవసరమైతే అఖిల పక్షాలను కలుపుకోవాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తమిళనాడు తరహాలో ఏపీ ప్రభుత్వం కూడ ఆదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ అధ్యక్షులు గోపీనాథ్, రాముురాయల్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, నాయకుడు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏఓపై చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ మహిళా ఉద్యోగ, కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతున్న ప్రభుత్వాస్పత్రి ఏఓ రామ్‌ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌ను సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం అనంతపురంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తదితరులు ఆయనను కలిసి ఏఓ చేసిన అక్రమాలను వివరించారు. ఏఓపై విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు పంపుతున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతామని డీసీహెచ్ఎస్ హామీ ఇచ్చారని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఓబులేసు, సాంబా, దావీద్‌లు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం ఎస్ఐ రమణ అయ్యప్ప, శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారని గురుస్వామి హరి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీ సాంబశివరావు గౌడ్, పీసీలు రామాంజుల రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన క్రిష్ణ, రాజన్న శుక్రవారం పొలం గట్టు విషయంలో ఘర్షణ పడ్డారు. ఘర్షణలో క్రిష్ణ అనే వ్యక్తి గడ్డపారతో దాడి చేయడంతో రాజన్నకు గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు క్రిష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: కర్ణాటక మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. శుక్రవారం ఉదయం సిబ్బందితో కలసి సీఐ దాడి చేసి మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో కొంత కాలంగా మద్యం విక్రయిస్తున్న నారాయణస్వామిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 15 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణ, ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్ల స్వాధీనం

తాడిపత్రి రూరల్: మండలంలోని బొందలదిన్నె గ్రామంలో కర్ణాటకకు చెందిన 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడు రామయ్యను అరెస్టు చేశామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని పి.రామరాజుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని శుక్రవారం ఎస్ఐ ఆంజనేయులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు రోడ్డులో శనివారం ఆటో బోల్తా పడి డ్రైవర్ ప్రహ్లాద (40)కు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. తాడిపత్రి పట్టణం క్రిష్ణాపురం ఏడో రోడ్డులో నివాసం ఉంటున్న ఆయన ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. చుక్కలూరు వైపు వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రహ్లాదను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపొలమడ గ్రామ సమీపంలో శుక్రవారం మట్కా బీటర్ రంగనాయకులును అరెస్టు చేసి, రూ.4,800 స్వాధీనం చేసుకున్నామని అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

పామిడిలో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు

పామిడి: స్థానిక కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ అమ్మవార్ల 17వ జాతర మహోత్సవం సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి నాగన్న శుక్రవారం తెలిపారు. 21న ఆరు పళ్ల విభాగం, 22న న్యూ కేటగిరి వృషభాలకు రాతి దూలం లాగుడు పోటీలు ఉంటాయి. ఆసక్తి ఉన్న రైతులు 96425 78133, 96186 02061, 73306 51416లో సంప్రదించవచ్చు.